# వామనుడు వామనుడే

ప్రేమలత, జలజ అక్క చెల్లెళ్లు. వీళ్ళిద్దరి పెళ్ళిళ్ళు ఒకే సంవత్సరంలో అయ్యాయి. ప్రేమలత భర్త వామనరావు. డబల్ ఎం.ఎ! గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు.

జలజ భర్త డాక్టర్ శేషశర్మ. హైదరాబాద్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. సైన్స్ అంటే ప్రాణం. అన్నం తినేటప్పుడు కూడా సైన్స్ గురించే ఆలోచిస్తుంటాడు.

పెళ్లైన కొత్తలో రెండు జంటలూ ఒకసారి పండక్కి వచ్చారు. శేషశర్మ అన్నం తింటూ, ఏదో ఆలోచనలో పడి, డైనింగ్ టేబుల్ మీదున్న పెరుగు, తను తింటూన్న పప్పులో పోసేసుకున్నాడు. "ఏదైనా సైన్స్ ప్రయోగమా" అంటూ, ప్రేమలత మరిది గార్ని ఆటపట్టించింది. అందరూ నవ్వుకున్నారు.

మరుసటి రోజు సంక్రాంతి పండుగ. భోజనాల సమయంలో ఏవేవో సరదాగా మాట్లాడుకుంటున్నారు! ప్రస్తావన కథల మీదకి మళ్ళింది. "అబ్బ! అసలు యీ కథలు ఎలా రాస్తారో కాని కొన్ని, కొన్ని బలే బాగుంటాయి" అంది జలజ.

వామనరావు కలగజేసుకుంటూ "కథకి శైలి, శిల్పం, భాష చాలా ముఖ్యం. చెప్పవలసిన కథావస్తువుని పాఠకుల హృదయానికి హత్తుకునేటట్లు చెప్పాలి!" అన్నాడు.

"బావగారు చెప్పిన ధోరణి చూస్తే కథలు రాయడంలో అనుభవమున్నట్లు కనిపిస్తోందే" అంది జలజ.

"నువ్వు చాలా తెలివైనదానివి! ఏ విషయమైన యిట్టే గ్రహించేస్తావ్. కిందటి నెల కూడా, నా కథలు రెండు పత్రికల్లో వచ్చాయి".

"మేం పత్రికలన్నీ తెప్పిస్తున్నాం. మీ పేరుతో ఏ కథా చదవలేదు మేం" అంది జలజ.

"ఓ ఆదా! "పరశురామ్" అన్న కలం పేరుతో రాస్తాను అన్నాడు వామనరావు.

"ఓహో! యింకో అవతారమా!" అనుకున్నాడు శేషశర్మ.

"నాకు చిన్నప్పట్నుంచీ కథలు రాయాలని కోరిక బావగారూ! ఎన్నోసార్లు

రాద్దామని ప్రయత్నించాను, కుదరలేదు. నేను పాడు చేస్తున్న పేపర్లు చూసి, మా అమ్మ "ఎందుకే కాయితాలు అలా తగలేస్తావ్, ఇదంతా నేషనల్ వేస్ట్!" అని తిట్టేది.

"అదేం పెద్ద కష్టం కాదు జలజా! కథ రాసే ముందు దాని స్వరూపమంతా ఊహించాలి! అన్ని సంఘటనలూ మన మెదడులో మెదలాలి. అంతే పత్రికలో అదే అచ్చయిపోతుంది" అన్నాడు వామనరావు.

"అయితే బావగారూ! మా ఆయన కూడా రాయొచ్చా".

అది విన్న శేషశర్మకి మనస్సు భగ్గున మండింది. "మా ఆయన కూడా అంటే ఏమిటో అర్థం! పెన్నుంటే ఎవరైనా రాయొచ్చు! అని లోపలే అనుకున్నాడు, కోపం దిగమింగుతూ, ఏం చేస్తాడు పాపం! ఆడపడుచులకి పుట్టింట్లో పుట్టెడు స్థానబలం కదా!

"మీ ఆయన్ని కూడా రాయమను జలజా!" అంటూ "మిస్టర్ శర్మ! నేను అవసరమైతే కొంత గైడెన్స్ యిస్తాను" అన్నాడు వామనరావు.

"ఖర్మకాలి మీ చేతుల్లో పడ్డాను. రీసెర్చ్ స్టూడెంట్స్‌కి నేనే గైడ్‌గా ఉండి డాక్టరేట్స్ యిప్పించాను. అటువంటి నాకు నువ్వు గైడ్‌వి!" అనుకున్నాడు శర్మ.

"థాంక్యూ బావగారు!" అంది జలజ.

ఒకసారి వైజాగ్ నుంచి ఫోన్ చేసినప్పుడు, కుశల ప్రశ్నలు వేస్తూ, "ఏం జలజా మీ ఆయన చేత కథలు రాయిస్తున్నావా!" అని అడిగాడు.

"ఇంకా లేదు!" అంది జలజ.

అక్కడే వున్న శర్మ అడిగాడు. "ఏమిటి యింకా లేదు అంటున్నావు!"

"అదే మీచేత కథలురాయిస్తున్నావా!" అని అడిగాడు మా బావ.

"నాన్సెన్స్! నా చేత నువ్వు రాయించడమేమిటి! నాకేమైనా అక్షరాభ్యాసమా" అని మండిపడ్డాడు.

"పోన్లెండి! ఏదో మనకంటే పెద్దాయన కదా! యథాలాపంగా అడిగి వుంటాడు" అంది జలజ.

ఆ మర్నాడు ఆదివారం! శెలవు రోజు. శర్మకి యిష్టమైన పెసరట్టు, ఉప్మా చేసింది జలజ. టిఫిన్ తిన్న తర్వాత యిక మొదలు పెట్టింది. 'ఈరోజు ఎలా అయినా

ఒక్క కథ రాసెయ్యండి! ఏదో పెద్ద! మా బావే గొప్పవాడనుకుంటున్నాడు! మా బావ ఆఫ్ట్రాల్ ఆల్.పి.జి., మీరేమో డాక్టరేట్! ఆయన రాయగా లేనిది మీరు రాయలేరా! అంటూ పౌరుషంవచ్చే విధంగా మాట్లాడింది.

"చదువుకీ కథలు రాయడానికీ సంబంధం లేదే! వెనకటి కెవడో అన్నాడట "బి.ఎ. పాసయ్యావు! కొబ్బరికాయ కొరకలేవా!" అని. అలావుంది నువ్వు చెప్పేది!" అంటూ అసలు రాయనంటే యిక ఉప్మా పెసరట్టు యోగం ఉండదేమోనని, కథ రాయడానికి ఒప్పుకున్నాడు శర్మ! ఇల్లు కట్టడానికి తాపీ మేస్త్రీ ఒప్పుకున్నట్లు!

ఒకసారి వామనరావు హైదరాబాద్ వచ్చాడు. 'పరశురామ్' పేరుతో కథలు రాసే ఆయన మాబావగారే అంటూ, ఆ చుట్టు ప్రక్కల వాళ్ళని పోగు చేసింది జలజ.

ఆ పాఠకులు, వామనరావుతో ముచ్చటిస్తున్నప్పుడు, ఒకసారి పెద్ద యోగిలా కళ్ళుమూసుకున్నాడు వామనరావు.

"సార్! ఏమైనా రాయబోయే కథ గురించి ఆలోచిస్తున్నారా!" అంది ఒక అభిమాన పాఠకురాలు.

'నో! నో! మిల్టన్ చెప్పింది గుర్తొచ్చింది!" అన్నాడు శర్మ.

"ఆ! మిల్టన్ వీడితో చెప్పాడు!" అనుకున్నాడు శర్మ.

"మిల్టన్ చెప్పిందేమిటి" అని అడగకుండానే మొదలుపెట్టాడు వామనరావు, "మై ఐస్ ఆర్ నాట్ లాస్ట్, దె ఆర్ టర్న్డ్ యిన్‌వర్డ్స్". ప్రపంచంలో కళ్ళున్న వాళ్లు బాహ్య ప్రపంచాన్నే చూడగలరనీ, కళ్ళు లోపలికి తిప్పబడిన మిల్టన్, తనలోని దివ్యకాంతి (సెలెస్టియల్ లైట్) చూసినట్లు చెప్పాడని" అన్నాడు.

"ఓహో చాలా బాగుంది సార్! సార్ ది బలే నాలెడ్జ్" అన్నారు, చాలామంది.

"వాళ్ళన్నదీ, వీళ్ళన్నదీ ముక్కుని పెట్టుకుని వదుల్తూండడం! ఈ లిటరేచర్ వాళ్ళకి యింక వేరే పనేం లేదు! మనిషిగా పుట్టినందుకు మనమేదైనా కొత్త విషయం కనిపెట్టాలి. అదీ మగతనమంటే" అనుకున్నాడు, కథలు రాయలేని తన అసమర్థతను తల్చుకుంటూ, శేషశర్మ.

మొత్తంమీద కథలలోని విషయం ప్రస్తావన రాకుండా, బోల్డు కొటేషన్లూ, పద్యాలు చెప్పి వైజాగ్ వెళ్ళిపోయాడు, బ్రతకనేర్చిన వామనరావు.

జలజ, పోరగా పోరగా, తప్పని పరిస్థితుల్లో శర్మ ఒక కథ రాసి, స్వయంగా వెళ్ళి, ఒక ఎడిటర్‌గారికి యిచ్చాడు. ఆర్నెల్లు గడిచినా ఆ కథ పత్రికలో రాలేదు. రోజులు గడుస్తున్న కొలదీ జలజకి ఆతృత ఎక్కువ అవుతోంది.

ఒకరోజు శర్మని తీసుకెళ్ళి, ఒకచోట అంజనం వేయించింది. అంజనం ఆవిడ, విషయం ఆకళింపు చేసుకుని, శర్మ వయస్సు ముప్పై అయిదు అని తెలుసుకుని, యింత వయస్సుకి కనీసం రెండు కథలైనా రాసుంటాడని వూహించి, యిది మొదటికథ కాదంది. జలజ శర్మకేసి "కొంప ముంచారు కదండీ" అన్నట్లు చూసింది.

తను యూనివర్శిటీ మేగజైన్‌కి, బలవంతంగా, మిత్రుల సహాయంతో రాసిన కథ గురించి జ్ఞాపకం వచ్చింది శర్మకి.

శర్మని పక్కకి తీసుకెళ్ళి "కనీసం పెళ్ళినాడైనా మీ మొదటి కథ గురించి చెప్పారు కాదేమండి!" అంటూ, అదేదో అక్రమ సంబంధం గురించి దాచినట్లు, నిలదీసింది జలజ.

'నాకిపుడిప్పుడే గుర్తొస్తోంది!' అన్నాడు శర్మ, శూన్యంలోకి చూస్తూ.

ఆ అంజనం ఆవిడ "యీ రెండో కథ పేరేమిటి!" అంది.

"తీరని కోరిక" అన్నాడు.

"ఇక 'యిది' అంతే! ఓ అయిదు వందలు యిచ్చి వెళ్ళండి" అంది గట్టిగా.

ఒకసారి శర్మ అమ్మగారు ఊర్నుంచి వచ్చి, శర్మను చూసి ఉసూరుమని "ఏమిట్రా నాయనా! అలా అయిపోయావు!" అన్నారు.

"ఏం చెప్పమంటావమ్మా, తీరని కోరికగా మిగిలిన నా కథ!" అన్నాడు శర్మ.

"ప్రస్తుతం నీ జాతకం బాగాలేదు" "నాకు ముందే తెలుసునమ్మా! లేకపోతే, కథారచయిత మరదల్ని ఎందుకు పెళ్ళాడతాను!"

"ఏమిటండీ!" అంటూ జలజ వచ్చింది.

"ఏం లేదు!" అంటూ అక్కడ్నించి జారుకున్నాడు శర్మ.

శర్మగారి తల్లి, యింట్లో దుష్టగ్రహ నివారణార్థం పూజలు చేయించారు.

ఈ పూజా ఫలం వలన పత్రికలో కథ వచ్చేస్తుందని నమ్మిన జలజ, ఎందుకైనా మంచిదని శర్మని తీసుకుని పత్రికా కార్యాలయానికి వెళ్ళింది.

ఎడిటర్‌గారి అద్దాలగది ముందు కూర్చున్న అటెండర్ "లోపలికి రచయితలే వెళ్ళాలి" అన్నాడు.

"అసలు కథ అచ్చయితే కదా మాఆయన 'రచయిత' అయ్యేది!" అనుకుంది జలజ.

ఆ అద్దాల గదిలోకి శర్మ ఒక్కడే వెళ్ళి ఎడిటర్ గార్ని కలిసాడు. బయట కూర్చున్న జలజకి ఆ అద్దాల గదిలోని తన భర్త, ఒకప్పుడు యింటెన్సివ్ కేర్ యూనిట్‌లో పెట్టిన తన మేనమామలా కనిపించాడు. 'ఏవండీ!' అని గట్టిగా అరిచింది. కార్యాలయంలోని వారందరూ గుమిగూడారు.

ఆ దంపతుల్ని మెల్లిగా ఆటో ఎక్కించి యింటికి పంపించేశారు.

సంక్రాంతి పండుగకి ఢిల్లీ నుండి కొత్తగా ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చిన సైంటిస్ట్‌ని భోజనానికి పిలిచాడు శర్మ. మాటల్లో వాళ్ళ కుటుంబంలోని వారందరికీ సాహిత్యం అంటే చాలా యిష్టమనీ, తన పెద్దన్నయ్య కథలు రాస్తాడనీ, యీ సంక్రాంతి కథల పోటీలో, అతనికి మొదటి బహుమతి వచ్చిందని చెప్పాడాయన.

తన బ్రీఫ్‌కేస్‌లోని ఒక వారపత్రిక తీసి "యీయనే మా అన్నయ్య" అంటూ, ఆ పత్రికలో అచ్చయిన ఫోటో చూపించాడు. ఆ ఫోటో కింద తెలియపరచిన వివరాల్లో "పరశురామ్" అన్న కలం పేరు చూసి, ఆశ్చర్యపోయాడు శర్మ.

జలజ చూసి నిశ్చేష్టురాలైంది!

ఆ అతిథిని సాగనంపిన తర్వాత, "జలజా! చూసావా! మీబావ గొప్పతనం!, ఎవరిదో కలం పేరు తనదని చెప్పి, తనో పెద్ద రచయితనని మనల్ని నమ్మించాడు. ఆయన చెప్పినవన్నీ నమ్మి, నన్ను కథ రాయమని నమిలేసావ్! మీ పొట్టి బావకి పుట్టెడు బుద్ధులు. మీ వామనుడు వామనుడే కాని పరశురాముడు కాదు".

"పోన్లెండి ఏం చేస్తాం! దశావతారాల్లో ఒకడైన మా బావ మా నాన్నకి దశమ గ్రహం!" అంది జలజ.

(రంజని (దసరా-దీపావళి) 2006)